నీరు పుష్కలం.. సాగుకు నిష్ఫలం

- వృథాగా పోతున్న కుమురంభీం ప్రాజెక్టు నీరు
- కాలువకు గండ్లు
- వాగులో కలుస్తున్న నీరు
- నాలుగేళ్లయినా పట్టించుకోని అధికారులు



కొత్త దుబ్బగూడ శివారులో ఎండిపోయిన కాలువ

వాంకిడి: ప్రాజెక్టులో పుష్కలంగా నీరున్నా వాటిని పంట సాగుకు అందించడంలో అధికారులు విఫలమవుతున్నారు. నాలుగేళ్ల క్రితం కురిసిన భారీ వర్షాలతో కుమురంభీం ప్రాజెక్టు ప్రధాన ఎడమ కాలువతో పాటు అనేక ఉపకాలువలు ధ్వంసమయ్యాయి. ప్రధాన కాలువకు అక్కడక్కడ నామమాత్రపు మరమ్మతులు చేపట్టినా.. ఉప కాలువలకు మాత్రం ఎలాంటి మరమ్మతులు చేపట్టలేదు. దీంతో ఉప కాలువలపై ఆధారపడి వేసవి పంటలు సాగు చేసుకునే రైతులు వర్షాధారిత పంటలతోనే సరిపెట్టుకుంటున్నారు. సరాండి నుంచి సామేల, దుబ్బగూడ, కనర్‌గాం మీదుగా వెళ్లే ఉప కాలువపై ఆధారపడిన రైతులు సాగునీరు అందక యాసంగిలో పంటలు సాగు చేయడమే వదిలేశారు. గండ్లు పడ్డ చోట మరమ్మతులు చేయాలని కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరిగినా ఎలాంటి ఉపయోగం లేకుండా పోయిందని.. తామే సొంత ఖర్చులతో గండ్లు పూడ్చినా మళ్లీ కాలువ తెగిపోతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వృథాగా సాగు జలం..

వాంకిడి మండలంలోని ఖమాన గ్రామ శివారులో గల పంట చేల మీదుగా ఆసిఫాబాద్ మండలంలోని గుండి వరకు ఉప కాలువ నిర్మించారు. నాలుగేళ్ల క్రితం భారీ వరదలకు కాలువకు పలుచోట్ల గండ్లు ఏర్పడ్డాయి. అప్పటి నుంచి నిధుల కొరతతో ఎలాంటి అధికారిక మరమ్మతులు చేపట్టలేదు. దీంతో కాలువ నీరు ఒర్రెలో కలుస్తూ వృథాగా పోతోంది. సుమారు 300 ఎకరాల యాసంగి పంట సాగుకు ఉపయోగపడే నీరు వృథాగా పోతుందని.. అధికారులు తగు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.



కొత్త దుబ్బగూడ గ్రామానికి వెళ్లే రహదారిపై ఉన్న ఒర్రెలో ఏ కాలమైనా మోకాల్లోతు నీరు ప్రవహిస్తుంది. గత 15 రోజుల క్రితం ఆ గ్రామంలో ఓ వివాహం ఉండగా పెళ్లి కూతురు తరపు బంధువుల వాహనాలు గ్రామానికి చేరలేకపోయాయి. దీంతో పెళ్లి కూతురితో సహా బంధువులంతా సుమారు కిలోమీటరు నడుస్తూ వెళ్లాల్సి వచ్చింది. ఆగ్రహించిన గ్రామ యువకులు ఒర్రె వద్ద నిరసనలు తెలిపారు. విషయం ప్రాజెక్టు అధికారుల దృష్టికి వెళ్లడంతో గేటు మూసివేశారు. కాగా ఇటీవల మళ్లీ ఒర్రెలో నీటి ప్రవాహం పెరిగిందని గ్రామస్తులు పేర్కొంటున్నారు.

వర్షాధారిత పంటలే దిక్కు..

ఖమాన, సామేలా, కోమటిగూడ, కనర్‌గాం, కొత్త, పాత దుబ్బగూడ, సిఫాబాద్‌లోని గుండి గ్రామాల శివారులో సుమారు 200 నుంచి 300 ఎకరాల్లో యాసంగి పంటలు పండిస్తున్నారు. వరితో పాటు గోధుమలు, కురగాయలు, తీగ జాతి పంటలు సాగు చేసేవారు. పత్తి పంటలో నష్టాలు వచ్చినా ఈ పంటల ద్వారా కొంత వరకైనా ఆర్థికంగా రైతులు కోలుకునేవారు. కాలువకు గండ్లు పడక ముందు పరిస్థితి బాగానే ఉన్నా ఆ తరువాత పరిస్థితులు పూర్తిగా మారిపోయాయి. బియ్యం, కూరగాయలు అమ్ముకునే స్థాయి నుంచి కొనుగోలు చేసే స్థాయికి పరిస్థితులు మారాయని రైతులు ఆవేదన చెందుతున్నారు. ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించి ఉప కాలువకు ఎగువ ప్రాంతంలో మరమ్మతులు చేయించి సాగు నీరు అందించాలని వేడుకుంటున్నారు.

చెప్పులరిగేలా తిరిగాం..



కాలువకు మరమ్మతులు చేపట్టి సాగు నీరు అందించాలని ప్రాజెక్టు అధికారులు, కార్యాలయాల చుట్టూ చెప్పులరిగేలా తిరిగాం. ప్రతీసారి చర్యలు తీసుకుంటాం అనడమే తప్పా సాగు నీరు అందించింది లేదు.

– గుర్నులె గణు, రైతు

తప్పక పత్తి వేస్తున్నాం..



కాలువ నీళ్లు ఆగిపోయినప్పటి నుంచి తప్పక పత్తి పంట వేస్తున్నాం. నాలుగేళ్ల క్రితం సాగు నీరు పుష్కలంగా ఉండటంతో వాణిజ్య పంటలతో పాటు వేసవిలో సంప్రదాయ పంటలు సాగుచేసుకునే వాళ్లం. ఎగువ ప్రాంతంలో ఏర్పడ్డ గండ్లతో కాలువలో చుక్కా నీరు లేదు.

– నగోషె భీమయ్య, రైతు

బాగా నష్టపోయిన..



కాలువ నీటిపై ఆశతో పత్తి చేలును వరి పంటకు అనుకూలంగా మడులుగా మార్చుకున్నాం. కాలువకు గండ్లు పడ్డాక సాగు నీటి సరఫరా చేయడం లేదు. దీంతో తీవ్రంగా నష్టపోయాను. చేసేదేం లేక మడులు తొలగించి లెవల్ చేయించాను.

– వడై నాందేవ్, రైతు

మరమ్మతులు చేపట్టాలి



గత నాలుగేళ్లుగా కాలువకు నీటి సరఫరా నిలిచిపోయింది. దీంతో పత్తి పంటతోనే సరిపెట్టుకుంటున్నాం. పంట చివరి దశలో పంటకు నీటి తడులు ఇద్దామంటే నీటి సౌకర్యం లేదు. కాలువకు మరమ్మతులు చేపడితే మేలు జరుగుతుంది.

– నగోసె సోమ, రైతు

క్లుప్తంగా

'కొరెంగ గోవింద్‌రావు మృతి బాధాకరం'



గోవింద్‌రావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న తుడుందెబ్బ నాయకులు

కెరమెరి: తొలితరం ఆదివాసీ హక్కుల పోరాట సమితి నాయకుడు కొరెంగ గోవింద్ రావు మృతి ఎంతో బాధాకరమని తుడుందెబ్బ రాష్ట్ర కోకన్వీనర్ గోడాం గణేశ్ అన్నారు. సోమవారం మండలంలోని చాల్‌బాడి గ్రామంలోని గోవింద్‌రావు నివాసానికి వెళ్లి ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఆదివాసీ సంస్కృతి సంప్రదాయాలను నిజాయితీగా నిరంతరం కాపాడారన్నారు. కార్యక్రమంలో ఆదిలాబాద్ సామాజిక కార్యకర్త అజయ్, ఆదివాసీ విద్యార్థి సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు సలాం వరుణ్ తదితరులు ఉన్నారు.

ధమ్మసారథి జన్మదిన వేడుకలు



వేడుకలు నిర్వహిస్తున్న నాయకులు

వాంకిడి: మండల కేంద్రంలోని జేత్వాన్ బుద్ధ విహార్‌లో సోమవారం బౌద్ధ గురువు, ఆల్ ఇండియా బుద్ధిస్ట్ సంఘం ప్రధాన కార్యదర్శి భంతే బదంత్ ధమ్మ సారథి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. అంబేడ్కర్ యువజన సంఘం, సమత సైనిక్‌దళ్, శ్రామ్‌నేర్ సంఘాల ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించారు. పాండు, విజయ్ ఉప్రె, విలాస్ ఖోబ్రగడె, రమేశ్, సందీప్, రాకేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు సన్మానం



హరీశ్‌బాబును సన్మానిస్తున్న నృత్యకళాకారులు

కాగజ్‌నగర్‌రూరల్: కళాకారులు అనుభవిస్తున్న కష్టాలను గుర్తించి తెలంగాణ సాంస్కృతిక సారథిలో ఉద్యోగాలు ఇవ్వాలని అసెంబ్లీలో ప్రస్తావించినందుకు సోమవారం ఎమ్మెల్యే హరీశ్‌బాబును కళాకారులు శాలువాతో సన్మానించారు. ఎమ్మెల్యే నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. నృత్య కళాకారులు సంతోష్, కార్తీక్, వసీముద్దీన్, బన్నీ, తదితరులు పాల్గొన్నారు.

'దుండగులను అరెస్టు చేయాలి'

ఆదిలాబాద్‌రూరల్: ఇంద్రవెల్లి మండలం కేస్లాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని నాగోబా ఆలయం సమీపంలో ఈనెల 27న గోండి ధర్మ గురు హీరాసుక లింగో జెండాను ధ్వంసం చేసిన దుండగులను వెంటనే అరెస్టు చేయాలని ఆదివాసీ హక్కుల పోరాట సమితి (తుడుం దెబ్బ) రాష్ట్ర కో కన్వీనర్ గోడం గణేశ్, జిల్లా ప్రధాన కార్యదర్శి వెట్టి మనోజ్‌లు డిమాండ్ చేశారు. సోమవారం మావల మండలంలోని బట్టి సావర్‌గాం శివారు ప్రాంతంలో గల కుమురం భీం గూడలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. హీరాసుక జెండాలను ధ్వంసం చేసి ఆదివాసీ తెగలలో చిచ్చుపెట్టే ప్రయత్నాలు మానుకోవాలని హెచ్చరించారు. దుండగులను అరెస్టు చేయకపోతే ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తామన్నారు. ఆదివాసీ ఐక్యతను విచ్ఛిన్నం చేసేందుకు కుట్రలు పన్నుతున్నారని మండిపడ్డారు. వరుణ్ తదితరులు పాల్గొన్నారు.

'మాల సామాజికవర్గానికి మంత్రి పదవి ఇవ్వాలి'

సిర్పూర్(టి): తెలంగాణ రాష్ట్రంలో ఎస్సీలలో రెండో అతిపెద్ద సామాజిక వర్గం మాల వర్గానికి ప్రభుత్వం కేబినెట్‌లో రెండో బెర్త్ కేటాయించాలని కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా ఆల్ ఇండియా కాన్ఫడరేషన్ ఆఫ్ ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, మైనార్టీస్ ఆర్గనైజేషన్ కన్వీనర్ డోంగ్రె మానిక్‌రావ్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఎస్సీలలో మాదిగ సామాజిక వర్గానికి చెందిన వారిలో మంత్రులు, శాసనసభా స్పీకర్, ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ తదితర కీలక పదవుల్లో ఐదుగురు ఉన్నారని, మాల సామాజిక వర్గం నుంచి కేవలం ఒక్కరు మాత్రమే మంత్రి వర్గంలో ఉన్నారన్నారు. తెలంగాణ మంత్రివర్గ విస్తరణలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో మాల సామాజిక వర్గానికి చెందిన చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామికి మంత్రి పదవి ఇవ్వాలని డిమాండ్ చేశారు.

ఆలయ అభివృద్ధికి ప్రణాళిక

ఇచ్చోడ: జిల్లాలో అతిపురాతన ఆలయంలో ఒక్కటైన సిరిచెల్మ మల్లికార్జున ఆలయ అభివృద్ధికి రూ. 5 కోట్లతో ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్లు బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ అన్నారు. సోమవారం దేవాదాయశాఖ అధికారులతో కలిసి మల్లికార్జున ఆలయాన్ని సందర్శించారు. ఆలయాన్ని అన్ని హంగులతో అభివృద్ధి చేస్తామన్నారు. ఇచ్చోడ మండల కేంద్రం నుంచి సిరిచెల్మ వరకు రూ. 40 కోట్లతో డబుల్ రోడ్డు నిర్మాణం, సిరిచెల్మ మీదుగా నిర్మల్ జిల్లా పెంబి వరకు రోడ్డు నిర్మాణం కోసం అటవీశాఖ నుంచి అనుమతులు తీసుకుంటామన్నారు. గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో నిర్మించిన మినీ ఫంక్షన్ హాల్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక మార్గంలో నడవాలి

నేరడిగొండ: ప్రతిఒక్కరూ ఆధ్యాత్మిక మార్గంలో నడవాలని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని శ్రీదేవి భూదేవి సహిత శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయ 8వ వార్షికోత్సవంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయాల్లో నిత్యం పూజలు చేయడం వలన కుటుంబాల్లో సుఖశాంతులు నెలకొంటాయన్నారు.

ఘనంగా రంజాన్

జిల్లాలోని ఆయా మండలాల్లో సోమవారం రంజాన్ పండుగను ముస్లింలు ఘనంగా జరుపుకున్నారు. ఆయా గ్రామాల్లోని ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ఒకరికొకరు ఈద్ ముబారక్ చెప్పుకున్నారు.

– సాక్షి నెట్‌వర్క్



దహెగాం: బీబ్రా ఈద్గా వద్ద ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



పెంచికల్‌పేట్: ఈద్గాలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



సిర్పూర్(టి): బస్టాండ్ ప్రాంతంలోని ఈద్గాలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



రెబ్బెన: ఈద్గా వద్ద ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



కెరమెరి: రంజాన్ శుభాకాంక్షలు తెలుపుతున్న ముస్లింలు



కౌటాల: మసీద్ వద్ద ముస్లింల వేడుకలు



వాంకిడి: ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



కెరమెరి: చిన్నారులకు స్వీట్లు పంపిణీ చేస్తున్న ఎస్సై విజయ్



కెరమెరి: సుల్తాన్‌గూడ ఈద్గా వద్ద నమాజ్ చేస్తున్న ముస్లింలు

జనావాసాల్లో దుర్గంధం



దహెగాం: మండల కేంద్రంలో పారిశుధ్యం లోపించింది. డ్రెయినేజీ వ్యవస్థ సరిగ్గా లేకపోవడంతో మురుగు నీరు జనావాసాల్లోకి చేరుతోంది. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మురుగు నీరు పారడం వల్ల దోమలు వృద్ధి చెందడంతో పాటు దుర్గంధం వెదజల్లుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి మురుగు నీరు నిల్వ లేకుండా చూడడంతో పాటు డ్రెయినేజీ నిర్మాణం చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

కాలినడకన పౌరాకు పయనం



కాలినడకన వెళ్తున్న సేవాలాల్ స్వాములు

రెబ్బెన: మండలంలోని కైరిగూడలో సేవాలాల్ దీక్ష స్వీకరించిన స్వాములు సోమవారం మహారాష్ట్రలోని పౌరాకు కాలినడకన పయనమయ్యారు. ముందుగా గ్రామంలోని జగదాంబ దేవి, సేవాలాల్ ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం గోలేటి విలేజ్ బస్టాండ్ వద్ద ఉన్న లంబాడాల ఆరాధ్య గురువు రామారావ్ మహారాజ్ విగ్రహానికి పూజలు చేసి కాలినడక ప్రయాణాన్ని ప్రారంభించారు. శ్రీరామ నవమి నాటికి పౌరాలోని పౌరాదేవి ఆలయానికి చేరకుని అమ్మవారిని దర్శించుకున్న అనంతరం సేవాలాల్ దీక్షను విరమించనున్నట్లు స్వాములు తెలిపారు. మార్గమధ్యలో ఆటంకాలు కలగకుండా ప్రయాణం సాఫీగా సాగాలని జగదాంబదేవి, రామారావ్ మహరాజ్‌లకు మొక్కుకున్నట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో గ్రామస్తులు సుబ్బారావు, వసంత్‌రావు తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో 30 పోలీసుయాక్టు కొనసాగింపు

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణ, ప్రశాంతతను పెంపొందించేందు కు మార్చి 31 నుంచి ఏప్రిల్ 30 వరకు 30 పోలీసు యాక్టు(1861) అమలులో ఉంటుందని ఎస్పీ డీవీ శ్రీనివాసరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్ డివిజనల్ పోలీసు అధికారి, ఇతర ఉన్నతాధికారుల అనుమతి లేకుండా పబ్లిక్ సమావేశాలు, ఊరేగింపులు, ధర్నాలు నిర్వహించొద్దన్నారు. కత్తులు, తు పాకులు, కర్రలు, జెండాలు, పేలుడు పదార్థాలు, ఇతర ఆయుధాలు వాడొద్దన్నారు. లౌడ్ స్పీకర్లు, డీజేలు వినియోగించడం నిషేధమని తెలిపారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పల్లెప్రకృతి వనం.. కళా విహీనం!



గేటు విరిగిపోయిన పల్లె ప్రకృతివనం ముఖద్వారం



ఆకులు రాలి కనిపించని జామ చెట్లు



పిచ్చిమొక్కలతో నిండిన వనం



ఎండిపోయిన ఆకులతో సీతాఫలం వృక్షాలు

కెరమెరి మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన పల్లె ప్రకృతివనం కళావిహీనంగా మారింది. ఆలనాపాలనా చూసేవారు లేక ప్రకృతివనంలో నాటిన మొక్కలు ఎండిపోయాయి. సీతాఫలం, జామ, నిమ్మ చెట్లతో పాటు ఇతర చెట్లను పల్లె ప్రకృతి వనంలో నాటగా ప్రస్తుతం అన్ని చెట్లు వాడిపోయాయి. అధికారులు స్పందించి మొక్కలను సంరక్షించాలని మండలవాసులు పేర్కొంటున్నారు.

– కెరమెరి